# మరబ్రతుకులు

— బి. టి. రామానుజం

ఆ వేళ. విశాఖపట్నంకి దగ్గరగా, బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి నట్లు ఏ రేడియో ప్రకటన చెయ్యలేదు. తుఫానువచ్చి ఊళ్ళు, యిళ్ళు వూడ్చుకు పోయే ప్రమాదమూ లేదు. కనీసం భూకంపం వచ్చే సూచనైనా లేదు.

అయితే,

"ఆ లంజకొడుకుని వొదుల్తామా" అన్నాడు నర్సిగాడు పైవన్నీ జరిగిపో తున్నాయన్నట్లు.

"వొదలంగానే, వొదలం" అన్నాడు నారాయుడు సిగరెట్ పారేస్తూ.

"అవునాణ్ణి వొదల్రాదురా, నాయనా!- అన్నాడు సూరి.

పైడితల్లి, యిందాకణ్నుంచి, సూరికేసి అలా చూస్తూనే వున్నాడు.

"ఎలాగేట్రా—?" విసుక్కొన్నాడు సూరి. సూరంటే వూరివూరికే హడల్. సూరి అసలు పేరు.... సూరి, సూరడు— సూర్నారాయిణో అయుండాలి,

అతను లావుగా, ఎర్రగా వుంటాడు. ఎర్రిగా అంటే దొరలా వుండడు. బస్సులు తోలేవాడు దొరలా ఎలాగ వుంటాడయినా? అతను ఎల్లమ్మతోట జంక్షన్ దగ్గిర లాయరుగారి ఆఫీసు పక్కనవున్న గవర్నమెంటు సారా దుకాణంకి నమ్మక మైన కాతాదారు.

సూరి జీవితంలో, ఎప్పుడూ దేనికీ జడవలేదు. చిన్నప్పట్నుంచి అతను మొండిగానే పెరిగాడు. వూరి చివర్ని పూరిగుడిసెల్లో పుట్టాడు. అక్కడుండే దరిద్రింతోనే పెరిగాడు. రోజంతా ఎముకలు విరిక్కొట్టుకొని, పాటుపడి, బూతులు తిట్టుకొని, యింతాచేసి తాగటానికి రెండు పూటలా గంజయినా దొరకని బతుకులు— అవి ఎందుకలా తయారవుతున్నాయో అతనికి అంతు పట్టకపోయినా, మొత్తానికి తమ బతుకులన్నీ పైవాళ్ళని యింకా యింకా పెద్దవాళ్ళన్జేసి. పెంచడానికే పనికొస్తాయనీ, వాళ్లు పెరిగినకొద్దీ తమ బతుకులు మరీమరీ అధ్వాన్నం అయిపోతున్నాయనీ, అతనికి

గట్టి నమ్మకం కుదిరిపోయింది. జీవితంలో ఏమి వుండదు, ఒక సంతోషమూ, ఓరోజు కడుపునిండా తిండి వుందన్న సంతృప్తి, ఏమీవుండదు బతుకులో ఏమీ లేకపోయిన తర్వాత, ఫీలింగ్ వుండదు, సెంటిమెంటుకి చోటెక్కడ? సూరికి ఆ మెతకదనం ఏవీ లేదు. అతను ఉక్కుమనిషిలా వుంటాడు

అందుకే,

ఎవడన్నా—

"ఎలాగిరా?" అని కనక అంటే అతనికి చెడ్డచిరాకు.

"ఓరి, యీ దొంగనాకొడుకుల కెవరు జడవమని చెప్పార్రా? ఆళ్ళే మనకి జడవాలి. యీడి బాబెవడన్నా వచ్చి తోత్తాడేటా్రి ఈ బస్సులు?

"అయినా ఆడేటి. మరో బస్సువాడేటి— యింకో బస్సువాణ్ని అందరి మజ్జనెట్టి కొట్టడవేఁటి? ఎన్ని గుండెలా్రి నా కొడుక్కి? అయినా ఆడు వర్కరా. కాడే! బస్సోనరు. లంజకొడుక్కి కళ్ళెత్తిమీది కెక్కిపోయి కాపోతే, సాఫ్ జోలి కొస్తాడా?" సూరి తన మామూలు ధోరణిలో అన్నాడు.

"ఎందుకు లెద్దు సూరీ! ఆడిమాలాన ఆణ్ణిపోనీ" నారాయుడు అన్నాడు. అతను మెడచుట్టు మఫ్లర్ (చింకిది) చుట్టేసి, చేతులుకట్టుకొని కూర్చుని, చలికి యింకా వొణుకుతున్నాడు.

"తగువియ్యాల్టికి తెల్లారేలా లేద్రానాయనా–" పైడితల్లి చిన్న యినపచువ్వకి ఏవో పీచుగుడ్డలు చుట్టి, ఆయిల్‌పోసి, అంటించాడు ఒక్కసారి మంటలేచి అందరి ముఖాలమీదా పడింది.

పన్నెండు గంటల రాత్రయినా, వాళ్ళ ముఖాల్లో ఎక్కడా నిద్రఛాయ లున్నట్లు లేవు. ఏదో ఆత్రంగా వున్నాయి వాళ్ళ ముఖాలు

పెట్రోలు బంకుదగ్గిర అంతా నిశ్శబ్దంగా వుంది. బంకు ముందున్న బస్సు చీకటిలో భూతంలా వుంది. మంట వెలుగు పడగానే, దాని నిజస్వరూపం బయట పడింది,

ఏనాటిదో, తాతఁనాటి బస్సు. కొంతకాలం క్రితం రంగుపూసి, అదిచేసి, యిదిచేసి, కొత్తబస్సులా అలంకరించాడు. అప్పుడే అది పాతబడిపోయి, రంగుమీద

616

గీతలుపడి, అసహ్యంగా తయారైంది. బస్సుకి ఎన్నిరంగులు పూసి హడావిడి చేసినా ఒకటే. డొక్కుబస్సు డొక్కుబస్సే. ఎప్పుడు సరిగా నడుస్తుందో, ఎప్పుడు నడవదో తెలీదు. ఏక్షణాన యింజన్ ఆగిపోతు దో తెలీదు. ఎక్కడ బస్సుతోయ్యాల్సి వస్తుందో తెలీదు. అయితేనేం? బస్సుబస్సే! బస్సు డొక్కయినా సరే. దానిసర్వీస్ దానిదే. ఓవర్ లోడ్ చేసి, టైము దాటేసి రెండోబళ్ళ వాళ్ళతో దెబ్బలాటలు తెచ్చి, పోటీలుపడితే కాసులు గలగల లాడతాయి.

చక్రంనట్లు బిగించేసి. చేతులు దులుపుకొంటూ, పనయిందన్నట్లు చూసేడు పైకితల్లి.

"హూం—" అని నిట్టూరుస్తూ, "మరేటి సేస్తాంరా? యీ బస్సుల్లో పన్జెయ్యడ మంత మాదెచ్చదపని మరోటిలేదు, 'యింతేనా తేతే,' అంటాడు ఓనరు. ఆటుసూస్తే కాంపిటీసను. యిటుసూస్తే యీడు. బొక్క బద్దలయిపోతున్నాది" నారాయుడు అన్నాడు.

"మరే—" అన్నాడు నర్సి.

అతను చెక్కరు.

చెక్కరంటే యీ బస్సుల కండక్టర్లు మసిపూసి మారేడుకాయచేసి డబ్బులు చెక్కెయ్యకుండా 'చెక్' చేసే వాడన్నమాట. ఎక్కువ మంది బస్సోగర్లు ఈవూరి వాళ్ళుకారు, వాళ్ళందరూ ఎక్కడో గుంటూరు నుంచో, కాకినాడనుంచో వచ్చినవాళ్ళ. దాదాపు అందరూ ఒకేకులంవాళ్లు పాపం. వాళ్ళలో ఆపాటీ ఈపాటీ లేనివాళ్ళు వుండరుట. అందరికీ బాగా ఆస్తుపాస్తు లుంటాయిట. ఓవేళ అలా లేనివారెవరయినావుంటే వాళ్లబాధ భగవంతుడికి తప్ప మరెవరికీ అర్థంకాదు. కులంనుండి వెలివేసినట్లుంటుంది. ఈవెల్నుంచి బయటపడటాని కెంత ప్రయత్నించాలి? చేసినా ఎంతమంది శ్రమ ఫలిస్తుంది? అలా ఫలించిన వాళ్లసంగతి మనకక్కవల్సింది. ఏ అమాయకుడూ, తను పైకి వెళ్ళి, తనవాళ్ళందర్నీ తనతో పైకిలాగాలని చూడడు, అలా చూస్తే, ముందు అతనే కిందపడిపోతాడు. వాళ్ళవాళ్ళు చాలామంది వుంటారయినా. అందర్నీ ఎక్కడికని లాగుతాడు? అందుకే బస్సుల్లో నమ్మకంగా 'చెక్కరు' పని అప్పగిస్తారు. మరింక అంతే! ఎంతయినా నిజాయితీగా వుంటాడు. గొడవలుండవు. అలాంటి 'ట్రాప్స్'లో వేస్తారు. నర్సి, నర్సింహులు. (అతని పూర్తిపేరు నర్సింహారావు మనుషుల పరిస్థితులను బట్టి పేర్లు మారుతుంటాయి, అతనే ప్రయివేటు కంపెనీకో అధికారయ్యివుంటే,

617

'బాస్' అని పిల్చేందు రందరూ) అతనికి తెనాలిలో కొద్దిగా, బహుకొద్దిగా పొలం వుంది. సంవత్సరానికో రెండువేలు దానిమీద వస్తుందతనికి. ముఫ్పై రూపాయలు అద్దె యిచ్చి వుంటున్న చిన్నగది— అందులో అతనితో వచ్చిన అమ్మాయివుంది. ఈ అమ్మాయి అతని భార్యకాదు అతను తనకువచ్చే నూటఏనభై రూపాయల్తో– ఆవూళ్లో ఎలా బతుకు యీడుస్తున్నదీ ఆ 'అమ్మి'కి తెలీదు. అమ్మికి అతనంటే యిష్టం సొంత వూరుది. నర్సింహులు కళ్ళకి 'బానే' వుంటుంది. అమ్మిని సుఖపెట్టాలని అతని తాపత్రియం. ఓ హోటల్లో రిజర్వ్‌చేసిన, ఓ రూంలో పేకాడే కొందరు ప్రబుద్ధుల్లో అతనుంటాడు. 'టెన్- ట్వంటీస్'- రమ్మి ఆట. ఎలా ఆడతాడో వూర్లో జనంకి అర్థం కాకపోవచ్చునుగాని. మిగతా పార్టనర్స్‌కి అందులో ఆస్చర్యంలేదు. అదిగాక అతన్ది విన్నింగ్ హాండ్‌టః బస్సు కలెక్షన్ల విషయంలో ఎంత తనకులం వాళ్లయినా 'పాతివ్రత్యం' వెలగబెట్టాలని ఎక్కడ వుంది ? పేకాటలో ఓవేళ అతనికి నష్టం వచ్చినా అతనికి మామూలుగానే వుంటుంది. అతనెప్పుడూ ఆటకి ముళ్లమీద కూర్చున్నట్లు కూర్చోలేదుగానీ. ప్రస్తుతం అతనికి ముళ్ళమీద కూర్చున్నట్లుంది.

"పైడితల్లీ, అయిపోయిందిరా?" అన్నాడతను చివరికి.

పైడితల్లి, పని యిందాకే ముగించేశా నన్నట్లు చేతులు దులుపుకొన్నాడు.

"దీనమ్మ! ప్రతి రాత్రి సేపేం—" అన్నాడతను.

పైడితల్లి బతికిచెడిన మనిషి. అతను చేసినపన్లు చాలా వున్నాయి. చేసిన ఉద్యోగాలు చాలావున్నాయి. చిన్నచిన్న పనులుచేశాడు. పెద్దవాళ్లదగ్గిర పనిచేశాడు. బంట్రోతు- ఉద్యోగాలు చేశాడు, కొంతకాలం కిళ్ళీ బడ్డీ. మరికొంత కాలం కిరాణా దుకాణం నడిపాడు 'శని' అంతా అతనినెత్తినే వున్నట్లుంది– 'బ్రాకెట్' రూపంలో అతన్ని మాపేసింది. మూడువేల రూపాయలు దివాలా, చివరికి క్లీనరయాడు. అతనికి ముప్ఫయ్యేళ్లుంటాయి. కాని నలభైవున్నట్లు కనబడతాయి. ఎప్పుడో పోగొట్టుకొన్న దాని గురించి యింకా విచారిస్తున్నట్లు కనబడతాడు,

అసలు పైడితల్లికి లోకమంతా విచిత్రంగా కనబడుతుంది. అతని కళ్లముందు చాలామంది 'పెద్ద' వాళ్ళయిపోయారు. కిళ్ళీబడ్డీతో మొదలుపెట్టి పెద్ద మేడలుకట్టిన వాళ్లున్నారు, లారీలు కొన్నవాళ్లున్నారు. కంట్రాక్టర్లయిన వాళ్ళున్నారు, ఏ 'ట్రిక్' ఉపయోగించి, వాళ్ళందరూ పెద్దవాళ్ళయిపోయారో, ఆ కీలకం అతని[illegible]పట్టలేదు.

618

'సినోడు పెద్దోడవటం కల్ల' అనుకొన్నాడుగానీ. పెద్దోళ్ళయిన చాలా మంది కళ్లెదురుగా కనబడుతుంటే, 'కల్ల' అని ఎలా అనుకోగలడు? "ఆ భగమంతుడి దయ, అదురుష్టం వుండాల—" అనుకొంటాడు చివరికి. 'తనకూ ఆ అదురుష్టం తగలదా?' అని ఆశ. లోకమంతా 'అన్నేయం' అనికూడా అతని నమ్మకం. 'అయితే. అన్నేయాన్ని భగమంతుడే సూస్తాడు'.

నారాయుడు యిందాకణ్నుంచి నిశ్శబ్దంగా వూరుకుండిపోయాడు. అతనికేదో బాధగావుంది. ఏదోశక్తి పీడించుకొని తినేస్తున్నట్లుం దతనికి. తలపోటు వచ్చేస్తోంది. తనుకారణం కాని వాటికి శిక్ష ఎందుకు తను అనుభవించడం జరిగిందా అని అతను మధన పడిపోతున్నాడు ఉద్రిక్త పరిస్థితుల్లో యివాళ ఏదయినా జరగొచ్చు. కానీ రేపుమాట ఏమిటి?

"యియాల్టికి పోదాం" అన్నాడతను.

"సంగతేటౌద్దో రేపు సూద్దాం"— సూరి.

వెలుగుతున్న మంటని 'టప్'న నేలని కొట్టి, ఆర్పేసి,

"పదండెహె—" అన్నాడు పైడితల్లి.

*    *    *

అసలు నారాయుడుకి తను చేసే కండక్టర్ పనికి యిన్ని తగువులుంటాయని అనుకోలేదు. అతను ఎస్సెల్సి తప్పేడు. తప్పేడంటే చదవక కాదు, టైఫాయిడ్ వచ్చింది. తప్పేడు, మరి చదవలేదు. కండక్టర్‌గా చేరేడు. నెలకి జీతం, బేటీలు, కలెక్షన్ రెండొందల యాభైదాటితే, బోనస్—

అతనుద్దేశంలో, ఈ బస్సుల గొడవా అదీ పెద్దయుద్ధం. యుద్ధంలో అవతలవాణ్ని వోడించినంత పని చెయ్యాలి. ఇదో పెద్ద బిజినెస్. అంతా తనలాంటి వాళ్లే— తనలాంటి వాళ్లతో తనకు తగవులు, యింకో రూటువాడితో కాంపిటీషను. ఓ స్టేజికి వాడు ముందెళ్తే, మరోస్టేజికి తను బండి అడ్డం పెట్టెయ్యడం. అది కదలక ముందే కదలడం, తర్వాత స్టాపులో రెండోబండి ఆరోడ్డు మీదినుంచి వెళ్ళడానికి దారి యివ్వకుండా బస్సు ఆపడం— యిదీ తంతు.

జనం.

రష్.

తొక్కిడి.

ఈ తొక్కిడిలో దూసుకొంటూ వెళ్ళి టికెట్లు చింపాలి. మధ్య మధ్యలో పాసింజర్ల తిట్లు. ఎవరికోసం యివన్నీ? తనకోసమా? తను 'కలెక్షన్' చేసే డబ్బులు సంచిలో వదేసుకొనే డబ్బులన్నీ— తనకోసమా?— కాదే! 'ఖర్మ'.

కాలేజీ ట్రిప్పులయితే మరీను. ఫుట్ బోర్డుమీద వ్రేలాడిపోతారు. స్టూడెంట్సు— ఏమన్నా అంటే మళ్ళీకోపాలు, దెబ్బలాటలు, కొట్టుకోడాలు, కాలేజీ ట్రిప్పుల్లో అమ్మాయిల మధ్యకి వెళ్లాలంటే అతనికి భయం. వెనకనుంచి అరుపులు—

"మీ బస్సుల్లో కండక్టర్ జాబ్ బెస్టు గురూ—"

"లక్కీఛాన్సు గురూ" అంటూ.

బస్సు కెపాసిటీ అరవై అయితే, వందకుతగ్గదు. ఓవర్‌లోడ్ పట్టుకొనడం కల్లే. ఓనర్లకీ ఆర్టీవోలకీ మధ్య ఎప్పుడూ ఏవో వుంటూనేవుంటాయి. ఎప్పుడయినా పేచీ వస్తే పట్టుకొంటాడు. లేదా, పైఅధికారి హఠాత్తుగావస్తే పట్టుకొంటాడు. సాధారణంగా పై అధికార్లు ఎప్పుడువచ్చేదీ తెలుస్తూనే వుంటుంది. అది బస్సు ఓనర్లకీ, వెంటనే తెలుస్తుంది. పై అధికార్లు వచ్చినప్పుడు మాత్రం, బస్సులు కెపాసిటీతో నడుస్తాయి. పురుగును కూడా ఓవర్‌లోడ్ చెయ్యరు. బస్సులు, రామరాజ్యంలోని బస్సుల్లా, ప్రయాణీకులకు హాయిగొల్పుతూ ఖాళీగా వెళ్తాయి డ్యూటీ ప్రకారం, రూలు ప్రకారం. కెపాసిటీతో వెళ్తాయి. మళ్ళీ ఏమన్నా అంటే,

"అదంతేనండీ! బిజినెస్. కండిషన్లు బావుండాల" అంటారు. అసలు గవర్నమెంటువారి ఆర్డరు ప్రకారం, ఏ గెజిటెడ్ ఆఫీసరయినా ఓవర్‌లోడ్ చేసినప్పుడు పట్టుకోవచ్చుట! ఆఫీసర్ల షర్టులు నలిగినా, మురికి అంటినా ? అదే మామూలువాళ్ల షర్టులు చిరిగిపోయి, చెప్పులు తెగిపోయినా—? (!)

'అసలు ఓవర్‌లోడింగ్ ఒక కళ. అది రానివాడు ఒట్టివవట ఓవర్‌లోడ్ చెయ్యమని ప్రతి వోనరూ, ఆజ్ఞ యిస్తాడు. ఆజ్ఞ యివ్వనివాడు బస్సుకొనడు. కొన్ని మర్నాడే అమ్మకు పోవాలిట!'

బస్సుల్లో పనిచేసేవాళ్లకి జీతాలు తక్కువ— పోలీసువాళ్లకు మల్లే. అందుకే కండక్టర్లయినా. చెక్కర్లయినా, రెండోరకం సంపాదనలు మొదలుపెడతారు. యిది ఓవర్‌లోడింగ్‌కన్నా పెద్దకళ. కొన్నికొన్ని బస్సుల్లో రోజుకి యిరవైముప్పై యింటికి పట్టుకెళ్ళే కండక్టర్లున్నారు. జేబు సంపాదన అంతా ఓ మిస్టరీ. గొప్పగొప్ప ట్రిక్కులున్నాయి అన్నిటికన్నా భారీఎత్తు వ్యాపారం దొంగ టిక్కెట్లు ప్రింటు చెయ్యడం.

నంబర్లతో సహా, అవే టికెట్లు. కొంతమంది టికెట్లు తీసుకోకుండా డబ్బులు యిచ్చి పోతుంటారు. టికెట్లు కొయ్యకుండా కండక్టర్ సంచీలోకి డబ్బులు వెళ్లాయంటే, అవి కండక్టరు సొంతం, క్లీనర్ తీసుకొన్న టికెట్లు మళ్ళీ కండక్టరు చేతిలోకి రావడం ఓరకం.

లైన్ బస్సులయితే, మరీ సులభం.

అయితే,

యిన్ని లొసుగులున్నా, ఓనర్లు బస్సుమీద బస్సులు ఎలా కొంటున్నా రన్నది నారాయుడికే కాదు, చాలామందికి గొప్ప మిస్టరీ. ఎన్ని లొసుగులు ? ఆర్డీ ఓ లకులంచాలు— రిపేర్లు యిన్నిపోగా యింకా బస్సుమీద బస్సు కొంటున్నారంటే. అసలీ లొసుగులన్నీ లేకపోతే, యీ ఓనర్లు ఏనాడో కోట్లు కూడ పెట్టుందురేమో ? అసలీ చిక్కంతా ఎక్కడుంది ?

అతని బుర్రికో చిక్కు ప్రశ్న—

అయితే,

ఎక్కణ్ణుంచి వస్తుందో తెల్సినా తెలీకపోయినా, లాభం అనేదివుంటే బెల్లం చుట్టూ మూగే ఈగల్లా. పోటీదార్లు వస్తూనే వుంటారు. వేగం వేగం మారుతున్న జీవితంలో ఆలస్యం భరించడం కష్టం. బస్సుల్లో ఎంత ఓవర్‌లోడ్ చేసినా, సర్దుకొని పోయేవాళ్ళకి, ఒక్కసారిగా బస్సు కెపాసిటీతో 'రన్'చేస్తే, ఎంతకష్టం?

అవతల ఆఫీసులు— ఏం గొడవ? తర్వాత బస్సులో చోటు దొరుకుతుందో లేదో తెలీదు.

"మీ యిష్టం వచ్చినట్లు మీరు నడిపితే, జనం వూరుకొంటా రేమిటండీ? యిందా కిందాక ఓవర్‌లోడ్ చేశారు. యింతలోకే ఏమయిపోయింది ? మమ్మల్ని చచ్చినట్లు తీసికెళ్ళండి."

"అయ్యా, అవతల ఓవర్‌లోడ్ హఠాత్తుగా పట్టుకొంటున్నారండీ! ప్లీజ్, నెక్స్ట్ బస్సులో రండి. లేదా బస్ ఆగిపోతుంది"

—యిదీ గొడవ.

"బాస్టర్డ్స్! అంతా వీళ్లయిష్టమే! వుండి వుండి తెగుళ్లు పుట్టుకొస్తాయి,"

నారాయుడికి యిక్కడో విషయం అర్థం అయింది. జనంకీ, ఓనర్లకీ మధ్య, ఎదురుగా 'విలన్'లా కనబడేది, స్టాఫ్. ఎన్ని బూతులయినా పడాల్సిందే. యింకో

విషయం కూడా అర్థం అయింది. బస్సులు చాలవు. బస్సులు చాలవు అంటే, జనం అవసరానికి తగినన్ని బస్సులులేవని. మరికొన్ని బస్సులుపడాలి.

మరికొన్ని బస్సులు పడితే?

ఒకో బస్సుకీ, కలెక్షనూ— లాభమూ తగ్గిపోతుంది. బస్సులున్నది దేనికి? లాభానికి అంతేగాని. ప్రజల సౌకర్యం కోసం కాదని విజ్ఞులందరికీ తెల్సును. యింకొన్ని బస్సులుపడితే, తనలాంటివాళ్ళు, యింకొందరికి పనిదొరికేది. యిప్పుడో? ఆ అవసరం లేకుండా, వున్నకొద్దిమందీ వాళ్ళపనీ, దాని ఫలితమూ, ఓనర్లకి ధారపోస్తున్నారు.

ఎన్ని అన్యాయాలు జరిగినా, అందరూ ఎంత నీచంగా బ్రతుకుతున్నా అల్టిమేట్‌గా, చివరికి ఓనర్లకి లాభంమాత్రం తప్పదు,

జనంకీ ఓనర్లకీ మధ్య, స్టాఫ్ నలిగిపోక తప్పదని అతనికి తెల్సుగానీ, ఓనర్ల లాభంకోసం రక్తం చిమ్మాల్సి వస్తుందని అతనెన్నడూ అనుకోలేదు. ఓవర్ లోడ్ చెయ్యలేదనీ, ఖాళీలేదని అన్నందుకూ అతన్ని ఒకటి రెండుమార్లు కాలేజీ కుర్రాళ్ళు కొట్టారు.

వెనకాల వున్నది వేరొకళ్ళయినా, ఎదురుగా వున్నందుకు దెబ్బలు తినక తప్పిందికాదు.

ఆట బొమ్మల్ని ఆడించేవాడు ఆట బొమ్మల మీద దౌర్జన్యంచేస్తే, దానిఫలితాలు చివరికి అనుభవించాల్సిన దశవస్తుంది.

కడుపులు మాడ్చడం, దోపిడీ అయితే,
అంతకన్న పెద్దదోపిడీ ప్రాణాలకు ఎసరుపెడ్తుంది.
అసలింతకీ ఏం జరిగిందంటే,
ఆరోజు

"అల్లదిగో, బెంజి బస్సు వెళ్ళిపోతోంది — లాగించెయ్" అన్నాడు నారాయుడు.

బస్సునిండా జనం
బస్ కదుల్తుండగా, బయటకు చూశాడతను.
బెంజివాడు కదిలిపోయాడు.

"ఒరేయ్! లాగించెయ్. ఆ దొంగలంజ కొడుకు చూశావు కదా, ఎంతలోడ్ చేస్తున్నాడో" అన్నాడతను.

622

పోటీలు పడ్తున్న రెండు బస్సులూ ఒకే 'రూట్'వి.

బస్సు వేగంగా వెళ్లి బెంజి బస్సుకి అడ్డంగా నిలబడింది. నారాయుడు బస్సు దిగి వెళ్లాడు.

"ఒరేఁ యిదేట్రా! పదినిమిషాల్లేటా! సర్వీసేటయి పోవాల్రా?"

"ఏట్రా?" అంటూ, అవతల బస్సులో కండక్టరు, కిటికీలోంచి తల బయటకు పెట్టాడు.

"ఏట్రా" ఏటి? పదినిమిషాలు లేటుచేసి, యిదేటి? పాసింజర్లని దింపెయ్-"

"అదేటార్రి- పాసింజర్సేటన్నా గొర్రెలేటార్రి దింపడానికి? బేగిపోనీరా-" అంటున్నాడు అవతల కండక్టరు

"అవతలి రెండుస్టాపులూ వొదిలెయ్—" అన్నాడు నారాయుడు. ఒదల్నన్నాడు అవతల వాడు.

చిలికి చిలికి గాలివాన అయింది.

స్టాఫూ, స్టాఫూ తన్నుకొనడం జరిగింది.

"ఏడిశారు! లంజకొడుకులు పక్కెలు జార్తాయని చెప్పండ్రా" అన్నాడు, నారాయుడు బస్ వోనరు.

అతనికి బ్యాంకులో ఎకౌంటూ, బస్సుల సంఖ్యా, బొజ్జా పెంచడం అలవాటయిపోయింది. అతను, బొజ్జ కుడిచేత్తొ రాసుకొంటూ, ఎకిలిగా నవ్వేడు.

వూళ్లో చాలామంది, అతన్ని 'కత్తి'లాంటి మనిషిగా పేర్కొంటారు,

"వూరొచ్చినప్పు డేఁవుందీ? ఏఁవీలేదు. ఐదేళ్ళకి బస్సు కొన్నాడు" అంటారు కొందరు,

"అసలాడికి దురాశలావు. ఎన్ని బస్సులున్నా చాలవు. లారీలున్నాయి. అయితే ఏం? వూరు వూరంతా వాడిదే అయినట్లు పోజు" అన్నాడు సూరి. అతనికి, యిద్దరు ఓనర్లమధ్యా వైరుధ్యాలున్నాయన్న సంగతి అర్థం అవుతూనేవుంది, ఆకసితోనే యీ దెబ్బలాట జరిగిందని అతని నమ్మకం,

"వూరు ఎవడిదో అప్పుడే ఏం తెలుస్తుంది?"

భవిష్యత్తులోకి దృష్టిపోనిస్తూ అన్నాడు ఓనరు.

ఓనరు ఎన్ని వెకిలికబుర్లు చెప్పి, ఎన్ని దవ్వాలు కొట్టినా జరిగిన గొడవ నారాయుడికి నచ్చలేదు.

"ఎందుకీ వెధవగోల? వాడి ఓనర్ని పెంచాలని వాడి తాపత్రయం. అదీ న్యాయమైన తాపత్రయం కూడా కాదు. యింకెన్ని గోలలవుతాయో—"

అన్నాడు నారాయుడు, సూరితో.

అయితే అవాల్సిన గొడవకన్నా పెద్దగొడవే అయింది.

ఈరకం గొడవ నారాయుడు వూహించలేదు.

రాత్రి తొమ్మిదిన్నర అవుతుంటే, బస్సు బస్టాండుదగ్గిర ఆగింది. బస్సు దగ్గిరకొచ్చిన ముగ్గురు మనుషులు పుష్టిగావున్నారు మధ్యలోవున్న ఒక్కడూ, భారీగా ఏనుగులా వున్నాడు. దళసరి కళ్ళద్దాలు, మనిషినిచూస్తే, ఎందుకో అసహ్యం వేసేలా వున్నాడు.

బస్సులో అట్టే జనంలేరు. వున్న ఒకళ్ళో యిద్దరో, ముసిలివాళ్లు, వెనక సీట్లో జారగిలబడి కూర్చున్నారు.

"ఒరే! ఎవర్రా కండక్టరు?" అన్నాడు, ఏనుగులాంటి మనిషి. అతనికి కండక్టరు ఎదురుగా, కాష్‌బాగ్‌తో కనబడుతూనే వున్నాడు.

'ఈ లంజకొడుకు దాపరించాడూ....' అనుకొన్నాడు పైడితల్లి.

అతనీ ఏనుగులాంటి మనిషితత్వం బాగా ఎరుగును.

ఏనుగులాంటి మనిషిపేరు సర్వేశ్వర్రావు. చాలా బస్సులూ, లారీలూ వున్నా యతనికి. బస్టాండు దగ్గిరున్న షావుకార్లలోనూ, యితర జనంలోనూ అతనికి ఎక్కువే పలుకుబడివుంది. అక్కడ అతనికి తిరుగులేదు. అతన్తో దెబ్బలాటకు దిగిన ఎవరైనా, ఆ ప్రాంతంలో 'సఫా' అవాల్సిందే.

పక్కనున్న వాళ్ళిద్దరిలో ఒకతను అతని తమ్ముడు. రెండోవాడు అతని భార్యకి తమ్ముడు.

"ఏట్రా! ఒకోళ్ళకి వొళ్ళు కొవ్వెక్కిపోతున్నది!" అన్నాడతను. నారాయుడు తెల్లబోయాడు.

"ఏటంటున్నారు—" అన్నాడు.

"అవున్రా! లంజాకొడుకుల్లారా! ఎందుకర్థం అవుతుందీ? మొన్న కొట్టుకుంది చాలక. అయినా మొన్న మొన్న వచ్చాడు మీ ఓనరు. ఏ ఒంటెగర్తనం?

ఏటంత ఇష్టనిష్టూర్చేశాడేటి? కలబడి కొట్టుకోడమేనట్రా? పాతేస్తే గతేటాఁ మీకు? ఏంటి? మాట్లాడవేటి?" సర్వేశ్వర్రావు రైజయిపోతున్నాడు. అదేపనిగా.

"అయ్యా! నేనీవూళ్లోనే పుట్టాను. మావోనర్ మరోవూర్నుంచి వచ్చాడు. నిజంవే! కొంచం కాలమే అయింది- కాదన్ను. అంతమాత్రాన మేం మీకు లొంగాలనుండేమిటి ? మీరూ దూరంనుంచే వచ్చారు. దూరం దూరం నుంచి వచ్చిన వాళ్ళందరూ కొద్దికాలంకే గొప్పోళ్ళయి, యిళ్లు కట్టుకొని బస్సులు కొంటున్నారు బాబూ! భవంతులు వేసేస్తున్నారు. మా మేటి? పుట్టింది యిక్కడే. చచ్చేదీ యిక్కడే. మాకు తినడానికి తిండీవుండదు, వుండటానికీ జాగా వుండదు మమ్మల్నెందుకు వెక్కిరిస్తారు, రోడ్లమీద నిలబెట్టిందిచాలక? అయినా, స్టాఫూ స్టాఫూ తన్నుకొన్నాం. మధ్యన ఓనర్లెందుకయినా?"

అన్నాడు నారాయుడు.

"ఓర్లంజకొడకా!"

యిద్దరు వచ్చి అతనిమీద పడిపోయారు. చుట్టూ చూస్తున్న జనం వూరుకుండిపోయారు. వాళ్ళంతా సర్వేశ్వర్రావు వెంట వచ్చినవాళ్ళే అయుంటారు.

"అదేటది? స్టాఫు తగువులకు ఓనర్లొచ్చి దవుర్జ్యం చేస్తారేటి" అన్నాడు సూరి.

"స్టాఫు తగువుల గురించి అడగటానికొస్తే. ఎలాగ పేల్తున్నాడో చూశావు కదా! యిదేటి పెళ్లాంతో సరసం అనుకొన్నాడేటి" అన్నాడు సర్వేశ్వరావు.

"రంకు మొగుడితో సరసం అనుకొన్నాను" నారాయుడికి ఒళ్లమండింది, కానీ అతను వలలో చిక్కినట్లయిపోయాడు అతన్ని రెండు వేపుల్నుంచీ, యిద్దరు పట్టుకొన్నారు. సర్వేశ్వర్రావు ఎదురుగా, కాలయముళ్లా నిలబడివున్నాడు. ఆతను మోచెయ్యితో బలంగా నారాయుడి కడుపులో పొడిచాడు.

"అమ్మో!" అన్నాడు. నారాయుడు బాధకి, కిందకి వంగిపోతూ.

"వేషాలు వేస్తున్నాడు!" సర్వేశ్వర్రావు రెండు చేతుల్తో, నారాయుడి తల పట్టుకు గుంజటం ప్రారంభించాడు. బస్సుమీదకు గట్టిగాతోసాడు. మిగతా యిద్దరు కూడా చేతులు చేసుకొన్నారు.

"ఓరి, ఓరోరి" అంటూ సూరి ముందుకు రాబోయాడుగానీ, నలుగురయిదుగురు అతన్ని బలంగా పట్టుకుని ఆపేశారు.

రెండు నిముషాల్లో నారాయుడ్ని చిత్తుగా తన్నేరు.

"ఏటనుకొన్నావో? జాగర్త."— సర్వేశ్వర్రావు.

నారాయుడి పళ్ళలోంచి రక్తం కారుతోంది- తల చిట్లింది.

"మీ పెద్ద బస్సోనర్లకీ, చిన్న వోనర్లకీ తగాదాలకి మధ్య మమ్మల్ని చంపండి" అనరిచాడు.

అందుకే—

పైడితల్లికీ, సూరికీ, నర్సికీ, నారాయుడికీ రక్తం కుతకుతలాడి పోతోంది.

వాళ్ళకేకాదు. ఈవిషయం తెల్సిన చాలామంది బస్‌వర్కర్లు కూడా అలానే వున్నారు.

* * *

"చంపేశారు! పోలీస్ రిపోర్టు ఎందుకిచ్చారు?" అన్నాడతను.

"వూ(—" అని వూరుకొన్నాడు సూరి.

పూర్ణామార్కెట్ వెనక భాగానవుండే కూరగాయల దుకాణందగ్గిర నిలబడి వున్నారు వాళ్లు.

"బెండకాయ లెలాగమ్మా...." అన్నాడు నారాయుడు.

అక్కడున్న కూరలు చవక.

చవక కూరలన్నీ, మార్కెట్ వెనక భాగానవున్న దుకాణాల్లో వుంటాయి. ముందువేపున్న కూరలు తాజావీ, ఖరీదయినవీను. యిక్కడ అన్నీ మిగిలిపోయినవి, కూరలు తాజావి కాకపోయినా, ఆకల్తో చావకుండా బ్రతకదల్చుకొన్న వాళ్ళకి పనికొచ్చే రకం కూరలు.

"అవు నంతతొంద రెందుకు" అన్నాడతను.

అతను గాభరాపడుతున్న జంతువులా కనబడుతున్నాడు. కరోనా వాళ్ళ పద్దెనిమిది రూపాయల బూటు వేసుకొన్నాడు. కాటన్ పాంటులో టెర్లిన్ షర్టు టక్ చేసుకొన్నాడు. చౌకరకం, కూలింగ్ గ్లాసులు పెట్టుకొన్నాడు.

"తొందరేమిటి?" విసుక్కున్నాడు సూరి.

"చంపేశావు, కొంప ముంచేశావు"

"ఇదిగో— నాగేశ్వర్రావ్, నువ్వెన్నిచెప్పు, నేను వినను. నాకు మండి పోతోంది. దీన్తో, అటో యిటో తేలిపోవాల్సిందే"

"ఛ ఛ- అలాగనకు సూరీ ! అసలు గొడవ పూర్తిగా చెప్పు" అన్నాడు నాగేశ్వర్రావు. నాగేశ్వర్రావు బస్ వర్కర్ల యూనియన్‌కి సెక్రెటరీ. అయితే, అతను బస్సు కార్మికుడు కాదు. ఆ మాటకొస్తే, అసలు ఏ కార్మికుడూ కాడు.

"ఏటవుద్ది ? ఏటీ తెలీనట్లు మాట్లాడక. ఓనర్లొచ్చి స్టాపుమీద దవుర్జన్యం చేస్తారూ—"

"ఛ ఛ ! మనోడిది కాస్తంత తప్పుంది" నాగేశ్వర్రావన్నాడు.

"యదవనాకొడుక్కు బుర్లాడక" సూరి వార్నింగిచ్చాడు.

"ఎంతసేపూ నీయిది నీదేగానీ మాటినవుకదా"

నాగేశ్వర్రావు ఎంతసేపూ కులాసాగావున్నట్లు కనబడటానికి ప్రయత్నిస్తాడు. మనిషికి చీకూ, చింతాలేనట్లు వుంటాడు. బస్సుల గొడవయితే, ముందు అతని కన్సల్టేషనుంటుంది. మనిషి అఖండుడిలా మాట్లాడతాడు. ఎవర్ని సపోర్టుచేస్తున్నదీ కనుక్కోవడం కష్టం. చివరికి అతనే అన్నాడు.

"అదికాదు గురూ, మనకూ ఓనర్లకీ తగువెందుకు గురూ? ఆళ్ల బావుంటేనే కదా మనబావు. ఆడు మన ఓనరవనీ, మరో బస్సవనీ, ముందు బస్సోనరు బావుండాలా? బస్సోనర్లే లేపోతే మనగతేటి ? అఁహ ! నువ్వే ఆలోచించు గురూ ! ఆదికెన్ని బస్సులున్నాయి ? చానావున్నాయి కదా? లారీలున్నాయి. షెడ్డుంది. ఆడెంత పెద్దోడన్నది కాదు నేచెప్పేది. ఆడికింద ఎంతమంది పన్జేసి బతికేదీ చెబుతున్నా— ఏటి ! డ్రయివర్లూ కండక్టర్లూ, క్లీనర్లూ చెక్కర్లూ, షెడ్డు వాచిమెన్లూ— ఎంతమంది? యీళ్లందరూ ఈడొక్కడి మీదేనా ఆధారపడి బతికేదీ? కాదా? మరాణ్ని నువ్వు 'అదిసేస్తా విదిసేస్తా'నంటే— ఆళ్ళందరూ నీలాంటోళ్ల కాదూ"

"అదిసరే. అసలు ఏడుపేడెహ—"

"తగ్గరా బాబు తగ్గు సిక్కొపం వస్తే ఎంతపనైనా సేస్తావని తెల్సుగావీ.

627

ఆగు ఆలోసించాల్సిన టయిం యిది. ఓసరొచ్చి కొట్టాడే అనుకో— అయినా ఆలోసించాలి కదా. ఎందుకొ్కట్టాడూ, ఏటి, కతా అని ఆలోసించాలా వొద్దా ? ఆడిమీద పోలీసు రిపోర్టిచ్చీడంవే? ఓరిబాబు. మనకది తగదురా. ఎందుకంటావూ, ఆడీకేసెలాగయినా కొట్టించీగల్డు, మనమీద కక్షగడతాడు, మసిచేస్తాడు. రేపు మరో బస్సోనరు మనల్ని వుజ్జోగంలోకి తీసుకొంటాడూ? అందుకే. మజ్జేమార్గం సూడమన్నారు. మనకీ మనకీ ఎందుగ్గురూ తగవులు. ఓనరు తప్పుచేస్తే, చెమించి పారెయ్యాలి అంతేగానీ, పోలీసు రిపోర్టులేటి ? కుక్క జట్టీల్లా. సర్వేశ్వర్రావు సేత చెమాపణలు వేడించీ పూచీనాది. కాంపెన్సేషన్ యిప్పించీ పూచీనాది, విన్నావ్ కదూ, రిపోర్టు విత్‌డ్రా చేసియ్యండి మరి.

"చావ్! నోర్ముయ్. దీనంతం చూడాల్సిందే"

"అదికాదురా నాయన, మన వొంటికది మంచిది కాదురా. నా మాటిని, యివేళ సాయంత్రంకి బష్టేండుదగ్గిర కొచ్చీండాౖ. షెడ్డుంది కదా, అక్కడికి అక్కడన్ని ఎవారాలూ సెటిల్ సేద్దాం, నామాటిని రంఁడ్రా. రాకుంటే వొట్టు. నా కరిజంట్ పనుంది. సాయంతరం ఏళ కొచ్చెయ్యండి"

అంటూ, నాగేశ్వర్రావ్ అర్జంటుగా వెళ్ళిపోయాడు.

"దొంగతొత్తు కొడుకు. అమ్మో! ఎంత దొంగలంజకొడుకో చూశావ్ కదూ. ఛీ వోనర్లకి కాకాకొట్టి బతుకు, కుక్కావుంది ఎందుకూ? సెటిల్ సేస్తాట! ఏటిసేస్తాడో సూద్దాం. యీాడి జేజమ్మ బతుకియేల బయటపడాలి. యాసికా లనుకొంటున్నాడు దవుర్జన్యానికి దవుర్జన్యంవే మందు—" సూరి మంటగా అంటుంటే నారాయుడు వింతగా చూశాడు.

* * *

ఐదున్నరకే చీకటి పడుతుంటే షెడ్డులో లైట్లు వెలిగాయి.

"యిదిగో వచ్చేశారు" అన్నాడు నాగేశ్వర్రావు, సూరినీ, నారాయుడ్నీ చూస్తూ, అతను వెనకవున్న పైడితల్లినీ, నర్సినీ యింకా వెనకవున్న జనంనీ చూడలేదు. షెడ్డులో యింకా మనుషులున్నారు. వాళ్ళందరూ బస్సువర్కర్లే,

పావుతక్కువ ఆరవుతుండగా, సర్వేశ్వర్రావు వచ్చాడు.

అతను నాగేశ్వర్రావును చూస్తూ, బరువు దిగినట్లు ఫీలయ్యాడు. అతను నాగేశ్వర్రావుని పక్కకి పిల్చి ఏదో మాట్లాడాడు,

628

సూరి, నారాయుడి చెవిలో,

"యదవనాకొడుకుల బతుకులు చూశావ్‌కదూ" అన్నాడు.

అంతా గోలగోలగా వుంది.

నాగేశ్వర్రావు, ఒక్కసారి గొంతు పెగుల్చుకొని గట్టిగా అన్నాడు.

"ఓనర్లొచ్చి మామీద దవుర్జన్యం చెయిడం గోరం బాబూ. ఓనర్లకీ పనోళ్లకి తగూలిలాపవస్తే ఎలా? తొందరతొందరలో గొడవలు జరిగిపోతాయి. చివారికి తలలు బద్దలుకొట్టుకోడాల కెళ్ళిపోతాయి. అయినా, స్థాపుతగువులకిలా ఓనర్లు కలగజేసుకోడం అన్నేయం. అణ్ణలా కొట్టేసినారుకదా. ఏటయిపోంది? ఆడు చచ్చి పూరుకొంటే ఏటి గతి? పనోళ్ళను కంట్రోల్ చెయ్యాలన్జెప్పి ఈరకంగా సేసేస్తే మాకేటిగతి. యిప్పు డయినాది సూసినారుకదా, ఓనర్లే పనోళ్ళను కొట్టేస్తే, మాకెవరు దిక్కు? పోలీసోళ్లు తప్పించి? మరందుసేతే, పోలీసు రిపోర్టిచ్చేశారు. ఎదో, మరేదో నష్టపరియారం యిచ్చెయ్యండి. ఏదో నచ్చజెప్పి రిపోర్టు వెనక్కి లాక్కుంటాం, ఏటంటారు"

సర్వేశ్వరావు మధ్యలో కల్పించుకొని అన్నాడూ.

"అసలు కలెక్షన్‌కోసం దెబ్బలాటలు పనికిరాదు, అసలీ పనోళ్ళని కంట్రోలు చెయ్యాలి, ఆబస్సోనరేటి, యీబస్సోనరేటి, అందరూ ఒకటే. పనోళ్ళలో తప్పుంతే ఓనర్లు సరిదిద్దాల. ఎవడయితేనేం, సరిదిద్దటానికి? ఓరకంగా అవాల్సింది మరోరకంగా అయింది"

"అదేటది? ఎంత మీరూ మీరూ ఒకటయినా మమ్మల్ని రక్తం వచ్చేలా కొడతారా?" సూరి మందువేసి రాలేదుగనీ. అతడంత ఆవేశంతో వున్నాడు.

"అవునది కాదండీ, యివాళ మమ్మల్ని కొట్టారు, రేపు మీస్తాపుతో మాకు తగువు అవుతుంది. మళ్ళీ తగువవుతుంది. అయినా ఎవరికోసం మా కీ పీకులాట. జనంతో గొడవలు, యింకో బస్సువాళ్లతో గొడవలు. అంతా గొడవలే మా ప్రాణా లకు సుఖమేలేదు.

"అయినా మా బతుకులకు విలువలేదు, రక్షలేదు, హామీలేదు. పనోళ్ళం పనోళ్ళం కొట్టుకుచస్తున్నాం, అంతేగా మీ సంబరం. కాలిమీద కాలేసుకొని డబ్బుల మూటలు కట్టుకొన్నారు మీరు. పొద్దుట్నుంచి రాత్రివరకు తన్నుకుచచ్చి కోసం, మీ

629

డబ్బుల మూటకోసం, యెదవ బతుకులు మేం బతుకుతుంటే, మామీద దవుర్జన్యం చేస్తారా మామీద. మా బతుకులకు విలువలేకుండా చేసిన మీ ప్రాణాలకు, విలువ మేం ఎందుకివ్వాల?" సూరి వూగిపోతున్నాడు.

అతన్ని చూస్తుంటే సర్వేశ్వర్రావుకి భయం వేస్తోంది. వ్యవహారం వుత్తి కత్తినే పీకమీదకి వచ్చినట్లు కనబడుతోందతనికి.

జనంలోంచి గోల.

అరుపులు,

యిదంతా చూస్తుంటే సర్వేశ్వర్రావుకి దడ పుట్టుకొస్తోంది.

నాగేశ్వర్రావు. రంగంలోకి దిగుమతి.

"సూరీ! చెప్పేది యినవేటి. చెమాపణ అంటున్నాడు కదా—"

నాగేశ్వర్రావు మాటపూర్తి అవకముందే. ఒకతను ముందుకొస్తూ,

"క్షమాపణలు దేనికి? లెంపకాయ కొట్టి క్షెమాపణంటే, ఆయనూరుకొంటాడూ?" అన్నాడు.

జనం మళ్ళీ గొల్లుమన్నారు,

"ష్! గొడవ్వొద్దు. చెప్పేది పూర్తిగా వినండి" నాగేశ్వర్రావు మళ్లీమొదలు పెట్టాడు:

"ఆయన తప్పయిందనొప్పుకుంటున్నాడు కదా, క్షెమాపణ అనగానే అది పోదు. నిజంవే కాంపెన్సేషన్ యిస్తానంటున్నాడు కదా. ఆయన చెప్పినట్లు వింటేనే మనకు మంచిది. లేదా మనకే నష్టం. ఆయన ఏదయినా చెయ్యగల్డు"

"నీ జేజమ్మ వచ్చినా అదికుదర్దు. నీయబ్బ సొమ్మేవడిదో యిస్తున్నావా కాంపెన్సేషన్? మాకడుపులు కొట్టిన సొమ్మేకదా అది. యీపోలీసు రిపోర్టు వెనక్కి చచ్చినా తీసుకోం. నీ వాడబ్బుకోసం కక్కుర్తి బతుకులను కొన్నావుటార్రి మా బతుకులు. యివి రక్తం దారపోసి బతుకుతున్న బ్రతుకులార్రి. డబ్బుతో మీయిష్టం వచ్చినట్లు మీరుచేస్తారు. మేం? మాకు డబ్బేటుంది. మాకండల్లో శక్తితప్ప. మేమందరం కలిస్తే మీ డబ్బేపాటి? పోలీసు రిపోర్టు యిచ్చాం డబ్బుతో దాన్నెలా మాప్పించగలరో

మేమూ చూస్తాం, మాకు నాయం వచ్చేదాకా వూరుకోం. ఈ పోలీసులూ, కోర్టులూ మాకు నాయం చెయ్యవా? మే మే వున్నాం. మా నాయం చూసుకోడానికి మీ డబ్బు న్నోళ్ళకీ, యీదొంగ కోర్టులకీ మా నాయం తెలీకపోవొచ్చు. లేదా మాక్కావాల్సిన నాయం యివ్వడాని కిష్టం లేకపోవచ్చు. కానీ, మా నాయం మాకు బాగాతెలుసు. దాన్ని సాదించుకోవాలంటే యేం చెయ్యాలోకూడా మాకు బాగాతెల్సు. యియేళ రాత్రితో మీకూ, మీ డబ్బుకూ, మీ కోర్టులకూ రోజులు చెల్లిపోయాయి మాకు నాయం మేమే చూసుకొంటాం. రేపు మరియాదగా మాకు నాయం దొరికి నువ్ శిక్ష అనుభవించావా సరే. లేదా, ఆ నాయం ఏదో మాచేతిల్లోకే తీసుకొంటాం. ఇదిగో యిదేటో తెల్సునా. యినుపచువ్వ. ఏటి చేస్తున్నానో తెల్సునా, బూవిలో పాతేస్తున్నా. రేపు మీగతీ అంతే'

సూరి చువ్వ గట్టిగా నేలలో గుచ్చాడు అతనికి ఒళ్ళంతా చెమటలు పట్టి పోయింది. ఏం జరుగుతుందో అతనికే తెలీడంలేదు. అతని చెవులకు గోలలు వినబడు తున్నయి అతనికళ్ళలో నీళ్ల తిరిగి, ఎదురుగా వెలుగుతున్న దీపాలు మసక మసకగా కినబడుతున్నాయి.

సర్వేశ్వరావు పనీ ఇంచుమించు అలానేవుంది. అతని గుండెదడ ఎక్కువయిపోతోంది. మధ్యవర్తిగావున్న నాగేశ్వర్రావు అతన్ని రక్షించేలాలేడు. అతనికున్న డబ్బూ, రేపు వెళ్ళబోయే కోర్టులూ అతన్ని రక్షించేలాలేవు. ఒకవేళ రక్షించినా వీళ్ల నుండి అతన్ని ఎవరూ రక్షించేలాలేరు. 'ఎలా తెల్లివార్తుందిరా భగవంతుడా' అనుకొం టున్నాడు సర్వేశ్వరావు.

'ఈ పాపం పండకపోదు మా బతుకులు తెల్లారకపోవు' అనుకొంటు న్నారు జనం.

---

ఔను. మన దరిద్రాలన్నింటికీ ఈ భగవంతుడి మీది విశ్వాసమే కారణం. గుళ్ళముందు, మసీదులముందు, చర్చిలముందు కనిపించే కోటాను కోట్ల దరిద్రులే దేవుడులేడని చెప్పడానికి తిరుగులేని సాక్ష్యం.

శ్రీ శ్రీ

631